
ప్రజాశక్తి

ఆదివారం 18 మే 2025 | 5 | పార్వతీపురం మన్యం



పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం : ప్రతిష్టాత్మక పద్మ అవార్డులకు కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత హోం మంత్రిత్వ శాఖ ప్రతీ సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డులు (పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ)ను ప్రకటిస్తుందని ఆయన చెప్పారు. . జిల్లాలో ఆయా రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన యువత, వ్యక్తులు తగు అర్హత, ఆసక్తి గల వారు దరఖాస్తులను తగిన వివరాలతో సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తు, నిబంధనలను www.padmaawards.gov.in వెబ్ సైట్‌లో పరిశీలించవచ్చన్నారు. యువజన సర్వీసుల శాఖ సెట్విజ్, విజయనగరం కార్యాలయానికి రెండు సెట్లులో దరఖాస్తు సమర్పించాలని ఆయన సూచించారు. వివరాలకు 9849909080, 98499013080 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చుట్టూ వివాదాల ఉచ్చు



- భూ వ్యవహారాల్లో తలదూర్చుతున్న బోనెల
- సెటిల్మెంట్,దందాల ఆరోపణలు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చుట్టూ వివాదాల ఉచ్చు బిగుసుకుంటుంది. ఎన్నికైన ఏడాది కాలంలోనే ఆయన అనేక భూవివాదాలు, వ్యవహారాల్లో తలదూర్చుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత ఎన్నికల ముందు ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉన్నత విద్యావంతునిగా, యువనాయకుడిగా ఆయన పనితీరుపై గంపెడాశలు పెట్టుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తల్లోనూ అసంతృప్తి గూడు కట్టుకుంటోంది. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ఎమ్మెల్యే బోనెల సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల అభిమానాన్ని చూరగొనలేక పోతున్నారు. భూవివాదాల్లో తలదూర్చి వ్యక్తిగత, పార్టీ ప్రతిష్టలను దిగజార్చుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కొద్దినెలల క్రితం పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామానికి చెందిన చుక్క శ్రీదేవి అనే మహిళ భూముల వ్యవహారంలో ఎమ్మెల్యే విజయచంద్ర జోక్యం చేసుకోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడితో ఆగకుండా టిడిపి రాష్ట్ర నాయకత్వానికి, జనసేన నాయకత్వానికి కూడా ఆమె ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ కింద మంజూరు చేసిన ఇంటి స్థలాల విషయంలోనూ ఆయన జోక్యం కనిపించింది. నిర్వాసితుల సంఘం నాయకులు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు ఇంటి స్థలం వివాదంలో తలదూర్చి చేతులు కాల్చుకున్న పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, చెరువుల వ్యవహారంలో అస్మదీయులకు ఒక రూలు, తస్మదీయులకు ఒక రూలు అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో భూకబ్జాలకు పాల్పడిన వారి అంతు చూస్తానని ఆయన ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ఆచరణలో ఆమడ దూరంలో ఉంది. ఇటీవల పట్టణంలో వరహాలగెడ్డ పరివాహక ప్రాంతంలో ఆక్రమణ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు నోటీసులు జారీ చేయడం వెనుక ఎమ్మెల్యే ప్రమేయం ఉందన్నదనే ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో పట్టణ పార్టీ నాయకుడొకరు లాబీయింగ్ చేసి నోటీసులు అందుకున్న వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా మండల తహశీల్దార్ జయలక్ష్మి ఎమ్మెల్యే వేధింపులపై పోలీసులకు పిర్యాదు చేయడం వివాదాస్పదమవు తోంది. ఈనెల 15న రాత్రి పది గంటల సమయంలో మహిళా తహశీల్దార్ జయలక్ష్మికి వాట్సాప్ కాల్ చేసి అసభ్య పదజాలంతో దుర్భాషలాడారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడం, దీనికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే టిడిపి నాయకులను, కార్యకర్తలను ఉసిగొల్పి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయించడం చర్చనీయాంశమవుతోంది. ఎమ్మెల్యే బోనెల వేధింపులను తాళలేక గతంలో తహశీల్దార్ జయలక్ష్మి కొద్ది నెలల పాటు సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. మండలంలోని ములగ రెవెన్యూలో గల బంకపల్లి ములగ గ్రామంలో కొంతమంది రైతుల భూములకు సంబంధించిన సమస్య గత కొంతకాలంగా వెంటాడుతోంది. సర్వే నెంబర్ 8/1 లో ఉన్న 25ఎకరాలకు సంబంధించిన భూములకు డిజిటల్ సిగ్నేచర్ జరగలేదు. ఇదే సర్వే నెంబర్‌లో ఉన్న మిగిలిన రైతులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమైంది. కానీ తొమ్మిది మంది రైతుల భూసమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఈ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే తహశీల్దార్‌పై ఒత్తిడి పెంచారు. అయితే తహశీల్దార్ ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడంతో ఆమెను ఆమెను దుర్భాషలాడడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ జయలక్ష్మి ఈ సమస్య పరిష్కారానికి బి.ములగ రైతులతో రూ.10లక్షలకు డీల్ కుదుర్చుకున్నారని, అడ్వాన్స్‌గా రూ.2లక్షలు తీసుకున్నారని ఎమ్మెల్యే బోనెల ఆరోపిస్తున్నారు. అక్కడితో ఆగకుండా టిడిపి నాయకులు, కార్యకర్తలను ఉసిగొల్పి తహశీల్దార్ కార్యాలయానికి పంపించి ఒత్తిడి పెంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈమేరకు శనివారం తహశీల్దార్ కార్యాలయానికి సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ వచ్చి టిడిపి నాయకులు, కార్యకర్తలతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అయితే ఈ వ్యవహారంలో తహశీల్దార్ తన మాట వినకపోవడంతో ఎమ్మెల్యే ఆమెపై ఎదురుదాడికి దిగారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే విజయచంద్ర అనుచరులే ఈ వ్యవహారంలో మధ్యవర్తిత్వం నడిపి రైతులతో డీల్ కుదుర్చుకున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారం ఎంత వరకు దారితీస్తోంది వేచి చూడాల్సిందే.

రాజీ కుదిర్చే పనిలో జిల్లా అధికారులు

ఎమ్మెల్యే బోనెల విజయచంద్రపై తహశీల్దార్ జయలక్ష్మి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఇద్దరి మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించే దిశగా జిల్లా అధికారులు పావులు కదుపుతున్నారనే చర్చ జరుగుతోంది. తహశీల్దార్ జయలక్ష్మి శుక్రవారం నుంచి కార్యాలయానికి రావడం లేదని తెలిసింది.

మహిళా అధికారికి రక్షణ కరువు : సిపిఎం

స్థానిక తహశీల్దార్‌ను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బూతు పదజాలంతో అసభ్యకరంగా తిట్టడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు తెలిపారు. పార్వతీపురం ఎమ్మెల్యే, తహశీల్దార్ మధ్య జరుగుతున్న వ్యవహారంపై సిపిఎం తన వైఖరిని వెల్లడించింది. ఈ మేరకు మండలంలోని రావికోన వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.వై.నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు కె.ఈశ్వరరావుతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం తహశీల్దార్ జయలక్ష్మిపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం రాత్రి 10గంటల సమయంలో వాట్సప్ ఫోన్ కాల్ చేసి నోటికి వచ్చినట్లు బూతులు తిట్టినట్లు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సోషల్ మీడియాలోనూ, పలు పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. దీని ఆధారంగా ఎమ్మెల్యే వైఖరిని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడతానని ప్రమాణం చేసిన ఎమ్మెల్యే తహశీల్దారు ఒక మహిళ అని కూడా చూడకుండా రాత్రి సమయంలో ఫోన్ చేసి తిట్టడం, బయటకు చెప్పుకోలేని పదజాలంతో అసభ్యకరంగా తిట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. మండల మెజిస్ట్రేట్‌గా ఉన్న తహశీల్దారుకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజానీకంపై ఎమ్మెల్యే ఏరకంగా వ్యవహరిస్తారో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఇటువంటి చర్యలు వల్ల ప్రజలకు న్యాయం జరగదని, వెంటనే ఎఫ్ఐఆర్ ఆధారంగా కేసు కట్టి చట్టబద్ధంగా చర్య తీసుకోవాలని, అలాగే జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి ఎమ్మెల్యే తహశీల్దార్‌ను బూతులతో తిట్టడం పై సమగ్ర విచారణ చేసి తహశీల్దారుకు రక్షణ కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని ఎమ్మెల్యే, తహశీల్దార్‌కు ఫోన్లో మాట్లాడిన విషయాలను ట్యాపింగ్ చేసి ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారుతనంగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

తహశీల్దార్, ఎమ్మెల్యే వివాదం పై దర్యాప్తు చేయాలి : కాంగ్రెస్

పార్వతీపురంరూరల్ : స్థానిక తహశీల్దార్ వై.జయలక్ష్మి, ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర మధ్య నెలకొన్న వివాదంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని పార్వతీపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి బత్తిన మోహన్‌రావు డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ నాయకులు గేదెల రామకృష్ణ, వంగల దాలి నాయుడు, వెన్నెల సురేష్, బీశెట్టి గౌరీశంకరరావు, ఒంటి బుచ్చయ్య, మజ్జి పరమేశ్వరరావు, కె.రమణమూర్తితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండల మెజిస్ట్రేట్ హోదాలో ఉన్న ఓ మహిళా తహశీల్దార్ ఎమ్మెల్యే తనను బూతు పదాలతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశారనిసోషల్ మీడియాలో, పత్రికల్లో హల్చల్ చేయడం బాధాకరమన్నారు. తక్షణమే తహశీల్దార్ పోలీసులకు చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎమ్మెల్యే తహశీల్దారుపై చేసిన ఆరోపణలపై కూడా ఉన్నతాధికారులు దర్యాప్తు నిర్వహించి నిగ్గుతేల్చాలన్నారు.

తహశీల్దార్‌ను దుర్భాషలాడడం అమానుషం : రాజన్నదొర

సాలూరు : రాష్ట్రంలో టిడిపి కూటమి పాలనలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. మండలస్థాయి అధికారులు అభద్రతాభావంలో పని చేస్తున్నారని చెప్పారు. శనివారం తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ చూడని విధంగా టిడిపి ప్రభుత్వం ఆలిండియా సర్వీస్ అధికారులను అరెస్టు చేస్తోందని చెప్పారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఐఎఎస్, ఐపిఎస్ అధికారి స్థాయికి ఎదిగిన అధికారులను అనేక కేసుల్లో ఇరికించి జైలుకు పంపుతుండడం ఈ ప్రభుత్వానికే చెల్లుబాటయిందన్నారు. మండల స్థాయి అధికారులు కూడా తీవ్ర అభద్రతాభావంలో పని చేస్తున్నారని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం హయాంలో తహశీల్దార్లు వనజాక్షి, నారాయణమ్మలపై బహిరంగంగానే టిడిపి నాయకులు దాడి చేసినా కేసుల్లేవన్నారు. తాజాగా టిడిపి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తహశీల్దార్ జయలక్ష్మిని అసభ్య పదజాలంతో దుర్భాషలాడడం అమానుషమని చెప్పారు. అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదని, అది తెలుసుకుని అధికారులు చట్టబద్ధంగా పాలన సాగించాలని రాజన్నదొర సూచించారు .



మొక్కలకు నీరు పోస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి నారాయణ భరత్ గుప్తా

స్వచ్ఛ పార్వతీపురం మనందరి బాధ్యత

జిల్లా ప్రత్యేక అధికారి పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ పార్వతీపురం మనందరి బాధ్యతని, కావున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై స్వచ్ఛత దిశగా అడుగులు వేయాలని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ పార్వతీపురం కార్యక్రమం జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్‌తో కలిసి ప్రత్యేక అధికారి కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం పురపాలక సంఘం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి, మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, వాణిజ్యవేత్తల సహకారంతో జిల్లాలోని అన్ని ముఖ్యకూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి చల్లని మజ్జిగ, నీరు వంటివి పంపిణీ చేయాలని సూచించారు. స్వచ్ఛతలో భాగంగా బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించు కోవాలని చెప్పారు. సొంత స్థలం కలిగి ఇప్పటి వరకు మరుగుదొడ్లను నిర్మించుకోని వారికి స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ రూ.15వేలు నిధులను మంజూరు చేస్తుందని, ఆ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల వారీగా నిర్వహించిన స్వచ్ఛ పార్వతీపురం కార్యక్ర మ వివరాలను సంబంధిత యాప్ నందు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెసి ఎస్.ఎస్.శోభిక, డిఆర్ఒ కె.హేమలత, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, కలెక్టర్ కార్యాల య ఎఒ సిహెచ్. రాధాకృష్ణ మూర్తి, పలు విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక హనుమాన్ కోడలి జంక్షన్లో స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛభారతపై మండల ప్రత్యేక అధికారి టి.రాజేశ్వరి ఆధ్వర్యంలో స్థానిక ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కెకె కుమార్ వర్మ ప్రజలతో ప్రతిజ్ఞ చేశారు స్థానిక వైద్యాధికారి పి.ఉషారాణి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత ఉండాలని, ప్రతి ఒక్కరూ పరిసరాల కోసం కొంత సమయాన్ని కేటాయించాలని అన్నారు. కార్యక్రమం అనంతరం అన్ని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అలాగే పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి రమ్య సాయి ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో వైద్య శిబిరం నిర్వహించారు.

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్రలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లిభద్ర బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం నుంచి పలువురికి తాగునీటిని అందజేశారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వై జర్ రౌతు లక్ష్మి మాట్లాడుతూ బీట్ ది హిట్ నినాదంతో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హాట్ కార్యక్రమాన్ని వీరఘట్టంలో మండల ప్రత్యేకాధికారి ఆర్.కృష్ణవేణి ఆధ్వర్యాన నిర్వహించారు. వైద్య శిబిరాన్ని, చలివేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ టి.వెంకటరమణ మూర్తి, హెల్త్ సూపర్వైజర్ ఓ.శాంతికుమారి, హౌసింగ్ ఎఇ వి.వినోద్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరి, ఎఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, విఒఎలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

పాలకొండ : స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా శనివారం బీట్ ద హీట్ కార్యక్రమంలో నగర పంచాయతీ కార్యాలయం నుంచి కోట దుర్గ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేపట్టారు ఈ సందర్భంగా కమిషనర్ రత్నరాజు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో డిప్యూటీ తహశీల్దార్ సన్యాసిరావు, సిటీ మిషన్ మేనేజర్ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

గిరిజనులకు సాగు పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు



సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కుడుమూరులో గల 48 సర్వే నెంబర్ 782 ఎకరాల ప్రభుత్వ భూమి తాతల కాలం నుంచి సాగు చేస్తున్న గిరిజనులకు నేటికీ పట్టాలు పంపిణీ చేయకపోవడం దుర్మార్గమని, వెంటనే అధికారులు స్పందించి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. కుడుమూరు భూ పోరాట కమిటీ కన్వీనర్ అప్పలస్వామి ఆధ్వర్యంలో కుడుమూరు మెట్టవలస వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా అనేక పోరాటాలు చేసినా నేటికీ సర్వేలు జరిపి పట్టాలు పంపిణీ చేయకపోవడంతో ఈ భూములను కాజేయడానికి కొంత మంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దీన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, గిరిజనుల అంతా ఐక్యంగా ఉండి తమ భూములకు డి పట్టాలు మంజూరు చేసే వరకు పోరాటాలకు ముందుకు రావాలని తెలిపారు. సిపిఎం గిరిజనులకు, పేదలకు అండగా ఉంటుందన్నారు. దీనికి నిరసనగా ఈనెల 23 నుండి 25 వరకు మూడు రోజుల పాటు పాదయాత్రలు జరుపుతున్నట్లు తెలిపారు వెంటనే పట్టాలు మంజూరు చేయకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ పట్టాల కోసం ఇప్పటి వరకు దరఖాస్తులు పెట్టుకున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల గిరిజనుల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని అన్నారు. కుడుమూరు 48 సర్వే నెంబరులో సాగు చేస్తున్న గిరిజనులందరికీ కూడా పట్టాలు పంపిణీ చేయక పోతే భవిష్యత్తులో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడతామని తెలిపారు. కుడుమూరు భూ పోరాట కమిటీ కన్వీనర్ అప్పలస్వామి మాట్లాడుతూ ఈ భూములను అనేకమంది పెద్దలు గద్దల్లా వాలి తన్నుకు పోవాలని ప్రయత్నిస్తున్నా రని, ఐక్యంగా ఉన్న గిరిజనులను విడదీసి ఇబ్బందులు గురి చేస్తున్నారని, తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతు లకు గురి చేస్తున్నారని, వెంటనే పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడు తూ కుడుమూరు సమస్యల పరిష్కారం కై ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే పాదయాత్రలను జయప్రదం చేయాలని, భవిష్యత్ పోరాటానికి గిరిజనులంతా ఐక్యంగా కదిలి సమస్య పరిష్కారా నికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోడుమూరు భూ పోరాట కమిటీ సభ్యులు సుర్రు గంగయ్య, మాదల జమ్మరాజు, రామయ్య గమ్మెల గోపాలు, కొర్ర కళ్యాణ్, కొర్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎలో గిరివెలుగు విలీనం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా డిఆర్‌డిఎ కార్యాలయంలోకి గిరి వెలుగు కార్యాలయాన్ని తరలించే ప్రక్రియ మొదలైంది. పట్టణంలోని వైకెఎం కాలనీలో ఉన్న జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో డిఆర్‌డిఎ కార్యాలయం ఉంది. గత కొంతకాలంగా రెగ్యులర్ డిఆర్‌డిఎ పీడీ లేకపోవడంతో గిరి వెలుగు ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో కొనసాగింది. పూర్తిస్థాయి ప్రాజెక్టు డైరెక్టర్‌గా సుధారాణి నియామకం కావడంతో గిరివెలుగు కార్యకలాపాలన్నీ డిఆర్ డిఎ కార్యాలయం నుంచే సాగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేయడంతో గిరి వెలుగు ప్రాజెక్టు కార్యాలయం నుంచి రికార్డులను శనివారం తరలించే పనులు చేపట్టారు.

ఎమ్మెల్యేపై సమగ్ర విచారణ జరిపించాలి

మహిళా అధికారితో వాట్సప్ కాల్ మాట్లాడే అధికారం ఎవరిచ్చారు?

అధికారులకు భద్రత కల్పించాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళా అధికారిపై రాత్రి సమయంలో వాట్సప్ ఫోన్ చేసి బెదిరించిన పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్రపై విచారణ జరిపించి, అధికారులకు రక్షణ కల్పించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఎమ్మెల్యే తహశీల్దార్‌ను దూషించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింద న్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులపై జరుగుతున్నాయ న్నారు.ఉమ్మడి జిల్లా చరిత్రలో ఎమ్మెల్యేపై ఒక అధికారి ఫిర్యాదు చేయడం తొలి సారన్నారు. మహిళా రెవెన్యూ అధికారికి రాత్రి పది గంటల సమయంలో ఫోన్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. తహశీల్దార్ రాత పూర్వక ఫిర్యాదు పోలీసులకు ఇచ్చారని తెలిపారు. అధికారులపైకి టిడిపి నాయకులను ఉసిగొల్పడం సరికాదన్నారు. మహిళా అధికారిపై ఎమ్మెల్యేగా అసభ్యకరంగా మాట్లాడితే జిల్లాకు చెందిన మంత్రి స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ములగ గ్రామ రైతులను ఎమ్మార్వో పది లక్షల అడిగారని చెప్పి ఆమెను అవినీతి పరురాలుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. డబ్బులు ఇచ్చారని రైతులు చెప్పకపోతే మరి ఎవరు ఎమ్మెల్యేకు డబ్బులు అడిగినట్లు చెప్పారని ప్రశ్నించారు. ప్రజా జీవితంలో లేకపోవడం వలన ఎవరితో ఎలా వ్యవహరించాలో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. ఆమె మానసిక స్థితి బాగోలేదని వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యేపై తక్షణం ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ మంత్రి కలుగజేసుకొని విచారణ జరిపి, అధికారులకు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే ఆలజంగి జోగారావు, నాయకులు కెవి సూర్యనారాయణ రాజు, ఇప్పిలి అనంత్, వర్రి నర్సింహమూర్తి, జై హింద్‌కుమార్ పాల్గొన్నారు.

అవినీతి అధికారులకు వంత పాడుతున్న వైసిపి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లా పరిషత్ చైర్మన్ వంటి బాధ్యత గల స్థానంలో ఉంటూ అవినీతి అధికారులకు వంత పాడడం శోచనీయమని, జరిగిందేమిటో తెలుసుకోకుండా రాజకీయ కక్షతో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం ఆ స్థాయిలో ఉన్నవారికి సరిపోదని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. ప్రజా ప్రతినిధిగా ప్రజా సమస్యలపై అధికారులను ప్రశ్నించడం పరిపాటని, జిల్లా పరిషత్ చైర్మన్ గాని మాజీ ప్రజా ప్రతినిధులు గాని మాట వినని అధికారులపై ఏనాడు ఆగ్రహం వ్యక్తం చేశారా, లేదా అన్నది ప్రజలకు తెలియజేయాలని కోరారు. అధికారులు ఇలా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడానికి, పాల్పడడానికి కారణం పాత పాలకుల పుణ్యమేనని అన్నారు. తానేమీ రియల్ ఎస్టేట్, మైనింగ్, లిక్కర్ వ్యాపారాలు చేయడం లేదని, అలాంటప్పుడు అధికారులు పై ఒత్తిడి తీసుకొని వచ్చే అవకాశం లేదని, ప్రజల మద్దతుతో పార్వతీపురం చరిత్రలో లేని మెజార్టీ ఇచ్చి గెలిపించిన ప్రజల కోసం నిలబడి పనిచేయడమే తనకు తెలుసునని, ఎన్నాళ్లు రాజకీయంలో ఏనాడు ఎమ్మెల్యేగా శాసనసభ ముఖం చూడని వారు శాసనసభ్యులను విమర్శించడం హాస్యాస్పదమని అన్నారు. గతంలో సీతానగరం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన విషయంపై ఏనాడు స్పందించని జిల్లా పరిషత్ చైర్మన్ తగుదునమ్మానని ఇప్పటి అవినీతి అధికారిని వెనుకేసుకురావడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయానికి సమస్యలను వివరించడానికి వచ్చిన ప్రజలను అడిగితే సదరు తహశీల్దారు వ్యవహారం గురించి వివరిస్తారని, ఎదుట వారిని విమర్శించే ముందు, గతంలో తాము చేసిన పనులను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట నయుడు, సీతానగరం మండల పార్టీ అధ్యక్షులు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

23న మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎట్టకేలకు ఈనెల 23న శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటన ద్వారా ఈనెల 23న శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌన్సిల్ సమావేశం మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్స్ ప్రత్యేక సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి పాలక పక్షం కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని తెలిపారు.


ఎంపిడిఒగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంఎస్ఎల్ ప్రసాద్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు సెలవులో ఉన్నారు. పాచిపెంట ఎంపిడిఒగా పని చేస్తున్న ప్రసాద్ బదిలీపై ఇక్కడకు రావడం, గతంలో ఇక్కడ ఇన్చార్జి ఎంపిడిఒగా పని చేశారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలుకుతూ సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూళ్ల మూసివేతలో దొందూ దొందే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ప్రభుత్వ స్కూళ్ల మూసివేత విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు దొందూ దొందే అన్నట్టుగా నడుస్తున్నాయి. అధికారం కోసం ఎవరికి వారే వ్యవహరించినా పాలన విషయంలో మాత్రం ఒక్కటేనని మరోసారి నిరూపించుకున్నారని జనం ప్రజాదృక్కోణంగల విద్యావేత్తలు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు చర్చించుకుంటున్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా రేషనలైజేషన్ పేరుతో స్కూళ్లను విలీనం చేస్తూ 117 జిఒ జారీచేసిన సంగతి తెలిసిందే. పాఠశాలల మెర్జింగ్ పేరిట తీసుకున్న ఈ నిర్ణయం గత విద్యాసంవత్సరం 3,4,5వ తరగతుల విద్యార్థులను ప్రభుత్వ విద్యకు దూరం చేసింది. లక్షలాది మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చేరాల్సివచ్చింది. ఆర్థికంగా అవకాశం లేనివారు అష్టకష్టాలు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో చాలా స్కూళ్లు మూసివేయడం, మరికొన్ని సింగల్ టీచర్ స్కూళ్లుగా మారిపోవడం తెలిసిందే. ఈనేపథ్యంలో గత ఎన్నికల ముందుకు కేవలం ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన బాటపట్టారు. దీన్ని కూడా ఎన్నికల్లో ఓట్లుగా మలుచుకోవాలని భావించిన కూటమి, ముఖ్యంగా టిడిపి నాయకులు విద్యావ్యవస్థను నాసనం చేసే 117 జిఒను ఏకంగా రద్దుచేస్తామని తెగేసి చెప్పారు. ఓ రకంగా చెప్పాలంటే మన జిల్లాలో టిడిపికి ఓట్ల రూపంలో బాగా కలిసొచ్చిన అంశమే. ఏరుదాటే వరకు ఓడ మల్లన్న... ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్టుగా ఎన్నికల్లో పేద విద్యార్థుల భిష్యత్తుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న టిడిపి, జనసేన కూటమి తీరా అధికారంలోకి వచ్చాక 117 జిఒ రద్దుకు మీనమేషాలు లెక్కించింది. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు విద్యామంత్రి పరువు తీసి భత్యం కట్టేయడంతో ఎట్టకేలకు జిఒను రద్దుచేయక తప్పలేదు. చింత చచ్చినా పులుపు చావదన్నట్టుగా జిఒను రద్దుచేసినా కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రుద్దుతున్న నూతన విద్యా విధానం అమలు విషయంలో మాత్రం కూటమి ప్రభుత్వం వెనుకాడడం లేదు. ఈ విషయంలో నాడు జగన్ ప్రభుత్వం బాటులోనే చంద్రబాబు ప్రభుత్వం కాలుదూర్చింది. పాత సీసాలో కొత్త సారా మాదిరిగా స్కూళ్లను మూసివేసి, ఉపాధ్యాయ పోస్టులు కుదింపే లక్ష్యంగా తీసుకొచ్చిన 117 జిఒను రద్దుచేసినట్లు చెప్పి తిరిగి అవే విధానాలతో 19,20,21వ నెబర్లతో జీవోలను జారీచేసింది. జిల్లాలో అప్రమత్తమైన ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ప్రభుత్వ గుట్టు రట్టుచేయడంతో జనం రోడ్లపైకి వస్తున్నారు. ఇదేం దొంగబుద్ధి అంటూ ప్రభుత్వ తీరుపై పబ్లిక్ టాక్ ఒకింత హాట్ హాట్‌గానే వినిపిస్తోంది. నాడు జగన్ ప్రభుత్వానికి, నేడు చంద్రబాబు పాలనకు తేడా ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులు ఏకంగా ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమౌతున్నారు. ఇంత జరుగుతున్నా వైసిపి నాయకులు నోరు మెదపడం లేదు. ఎందుకంటే నాడు వైసిపి అమలు చేసిందే నేడు కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. ఈనేపథ్యంలో విద్యారంగ సంస్కరణల అమలు విషయంలో వైసిపి, టిడిపి దొందూ దొందే అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.



హాస్టళ్లలో స్టాక్ రూంను పరిశీలిస్తున్న జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సౌమ్య జోషిఫిన్

హాస్టళ్లలో మౌలిక సదుపాయాల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జె.సౌమ్య జోషిఫిన్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పార్వతీపురం కళాశాల బాలికల బిసి, ఎస్‌సి వసతి గృహాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ఎస్‌సి బాలుర, బిసి బాలికల వసతి గృహం తదితర వసతి గృహాలను తనిఖీ చేశారు. వసతి గృహాల్లో లభ్యంగా ఉన్న సౌకర్యాలు తనిఖీ చేశారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని వియ్యాలవలస పంచాయతీ మూలగూడ జంక్షన్ వద్ద శనివారం సర్పంచ్ పి. అజ్జారి, పంచాయతీ కార్యదర్శి వై.వెంకట నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రానికి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రధాన కూడళ్ల వద్ద, వాహన చోదకులు, ప్రజల రాకపోకలు ఎక్కువగా సాగించే ప్రదేశం వద్ద వారి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, గ్రామ పెద్దలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

26న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పూర్తపాడు – లాబేసు వంతెన పెండింగ్ పనులు పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 26న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జయప్రదం చేయాలని శనివారం కూనేరు సంతలో గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా కొల్లి సాంబమూర్తి, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ నాయకులు రామారావు నాగావళి నదిపైన వంతెన పనులు ప్రారంభించి 19 ఏళ్లయినా పాలకులు పూర్తి చేయలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో వంతెన పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం, ఆ తర్వాత ఆ హామీలను మర్చిపోవడం యథాతథంగానే కొనసాగుతుందన్నారు. ఇప్పటికైనా పూర్తపాడు వంతెన పెండింగ్ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై పాలకులు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఈనెల 26న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు గిరిజన యువకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత గుమ్మలక్ష్మీపురం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఉద్యోగుల సంఘం ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 15 క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విజేతగా నిలిచింది. వేసవి క్రీడల్లో భాగంగా 15రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలోస్త్రు కె.శివడ పై గుమ్మలక్ష్మీపురం జట్టు విజయం సాధించింది. విజేతలకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేశామని నిర్వాహకులు తెలిపారు.

పనితీరు మెరుగుపరుచుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

అంగన్వాడీ కేంద్ర నిర్వహణలో పనితీరు మెరుగుపరుచుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి సిబ్బందికి సూచించారు. వీరఘట్టం- 4 అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కేంద్రంలో ఎంతమంది ప్రీస్కూల్ పిల్లలు ఉన్నారు. ఐదుగురు పిల్లలు హాజరు కావడం ఏమిటని సిబ్బందిని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో పిల్లలు హాజరయ్యేలా చూడాలని, వీరికి సక్రంగా మెనూ అందజేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బి.వెంకటరమణ, డిప్యూటీ ఎంపిడిఒ టి.వెంకట రమణమూర్తినాయుడు, ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్ఞానమ్మ, రాజేశ్వరి, ఇఒ బి.కోటేశ్వరరావు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం స్వాధీనం

పార్వతీపురం రూరల్ : మండలంలోని గోచెక్క పంచాయతీ నుంచి సరిహద్దు ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్న పది క్వింటాళ్ల బియ్యం బస్తాలను శనివారం విజిలెన్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, విజిలెన్స్ పోలీసులతో కలిసి నిర్వహించిన దాడిలో గోచెక్కకు చెందిన శ్రీనివాసరావు బియ్యం తరలిస్తున్నట్లుగా తెలుసుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. బియ్యాన్ని పార్వతీపురం ఎంఎస్ఎ పాయింట్‌కు, రవాణా చేస్తున్న వాహనాన్ని రూరల్ పోలీస్ స్టేషన్కు అప్పగించినట్లు సిఎస్‌డిటి తెలిపారు.

మహిళల జీవనోపాధి మెరుగుకు చర్యలు

గరుగుబిల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ మహిళల మెరుగైన జీవనోపాధి కోసం శిక్షణ ఇస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో గరుగుబిల్లిలో మహిళలకు ఇస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుంటున్న మహిళలతో మాట్లాడి వారి కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, స్వశక్తితో ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శిక్షణలో కుట్టడం, మరమ్మతులు తదితర అంశాలను నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో టైలరింగ్ నేర్చుకొనేవారు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు మాజీ డిప్యూటీ సిఎం సాయం

గరుగుబిల్లి : మండలంలోని చినగుడబలో అగ్నిప్రమాద బాధితులను మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి శనివారం పరామర్శించారు. ప్రమాదానికి కారణం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు ముడిలి కళావతి, ముడిలి మోహనరావు, ముడిలి భాస్కరరావుకు 50కిలోల బియ్యం, ఇతర వంట సామగ్రిని, నగదును అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాధితులను ఆదుకొనేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. బాధితులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరిశీలనలో మండల వైసిపి కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు, వైస్ ఎంపిపి బి.లక్ష్మి, సర్పంచ్ ముదిలి దుర్గాప్రసాద్, నాయకులు తెర్లి ఎల్లంనాయుడు, బి.వెంకట దామోదర్, అంబటి గౌరునాయుడు, బి.తాతబాబు, వెంకటనాయడు, శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

సీతానగరం : స్థానిక హనుమాన్ జంక్షన్‌లో శనివారం వాహనాలు తనిఖీలను ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. మోటార్ వాహనాలపై పాత కేసులు జరిమానా కట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుపతిరావు, జెపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్యామలాంబ పండగ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో ఆదివారం నుంచి శ్యామలాంబ పండుగ ప్రారంభం కానుంది. ఆదివారం ఉయ్యాల కంబాల, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమాను రథోత్సవం, బుధవారం అనుపోత్సవం జరుగనున్నాయి. పట్టణంలోని శ్యామలాంబ అమ్మవారి ఆలయం లో భక్తుల దర్శనానికి ఉత్సవకమిటీ, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. లక్షలాది మంది భక్తులు పండగకు రానున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉయ్యాల కంబాల ఉత్సవంలో భాగంగా ఆదివారం పట్టణంలోని పెదకోమటిపేట సీతారామ మందిరం సమీపానున్న అమ్మవారి గద్దె వద్ద ఉయ్యాల కంబాల ఉత్సవం జరుగుతుంది. స్థానిక జమిందార్ కుటుంబానికి చెందిన విక్రం చంద్ర సన్యాసిరాజును ఉయ్యాల్లో కూర్చుండబెట్టి పంపనున్నారు. గత సాంప్రదాయ, ఆచారాలకు అనుగుణంగా ఉత్సవ కమిటీ సభ్యులు పండగను విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించిన సబ్ కలెక్టర్

పట్టణం లో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న శ్యామలాంబ పండుగ ఏర్పాట్లపై శనివారం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్యామలాంబ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం భక్తుల దర్శనానికి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. సిరిమాను రథాన్ని పరిశీలించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కమిషనర్ డిటివి కృష్ణారావు, తహశీల్దార్ రమణ, డిఇ ప్రసాద్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



పండగ ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ఆకట్టుకున్న వీరభద్రుడి ప్రభ

శ్యామలాంబ పండుగ నేపథ్యంలో మెంటాడ వీధిలో ఏర్పాటు చేసిన వీరభద్రుడి ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రభను చూడ్డానికి వేలాదిమంది భక్తులు తరలివస్తారు. మెంటాడ వీధి పెద్దల సహకారంతో పండుగ సందర్భంగా మక్కువ బైపాస్ రోడ్డులో జబర్దస్త్ కామెడీ షో ఏర్పాటు చేశారు.

ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్నాయని, ఈ ఉష్ణతాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని, అధిక ఎండ వల్ల వచ్చే సమస్యను అరికట్టుకోవాలన్నారు. కరువు, వరదలు లాంటి విపత్తుల నుంచి కాపాడుకుందామని, సౌర శక్తి లాంటి పునరుత్పాదక విద్యుత్ని ప్రోత్సహిద్దాం అని, చల్లదనాన్ని ఇచ్చే చెరువులు, కుంటలు వంటివి మళ్లీ పునర్ నిర్మించుకుందామని అన్నారు. అలాగే ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడుకుందామని అన్నారు. ప్లాస్టిక్ రహిత పార్వతీపురాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఉద్దేశంతో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నివారించడానికి సహాయ సహకారాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు బొడ్డు పైడిరాజు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

వెంకంపేటలో...

స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం సందర్భంగా బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకంపేటలో తామర చెరువు వద్ద ఉపాదిహామీ వేతనదారులకు వడదెబ్బపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అవగాహన కల్పించారు. పని ప్రదేశం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను, నీడ కోసం వేసిన టెంట్లను పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. వృత్తిరీత్యా బాహ్య ఉష్ణోగ్రతల్లో పని చేసేవారు వేసవి వేడి నుంచి ఉపశమనం పొందాల్సిన ఆవశ్యకత ఉంటుందని అందుకు మనకు అందుబాటులో ఉన్న సులభ పద్ధతులను పాటించి ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త పడవచ్చు అన్నారు. అనంతరం వారికి అక్కడ తయారు చేసిన ఒఆర్ఎస్ ద్రావణం త్రాగించి ప్యాకెట్లను అందజేశారు.



సీతానగరం: వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రమ్యసాయి

ఆరోగ్య కేంద్రాల్లో చలివేంద్రాలు ఉండేలా చూసుకోవాలను, వద్దులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు.అందించే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు డిపిఎంఒ డాక్టర్ పిఎల్. రఘుకుమార్, వైద్యాధికారి డాక్టర్ ఎంఎన్‌కె తిరుమలప్రసాద్, సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, సూపర్వైజర్లు శ్రీరాములునాయుడు, జయగౌడ్, ఉపాధిహామీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : వడదెబ్బకు గురికాకుండ జాగ్రత్తలు పాటించాలి ఉపాధి కూలీలకు మండలంలోని పెద్ద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి రమ్య సాయి సూచించారు. మండలంలోని లక్ష్మీపురంలో చలివేంద్రం ప్రారంభించిన అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండల్లో ఎక్కువ సమయం కేటాయించుకుండా చెట్లు వద్ద సేదతీర్చుకోవాలన్నారు. అలాగే ఒఆర్ఎస్ ప్యాకెట్లను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట నాయుడు, ఎఎన్ఎం రమాదేవి, ఆశా, సచివాలయ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

తహశీల్దార్ తీరుపై టిడిపి నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక తహశీల్దార్ జయలక్ష్మి పనితీరును నిరసిస్తూ టిడిపి శ్రేణులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నిరసన తెలియజేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తమకు సంబంధించిన భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలతో వచ్చారు. అయితే ఆమె కార్యాలయానికి రాకపోవడంతో, రెండు గంటల నిరీక్షణ అనంతరం ఫిర్యాదుదారులు సబ్ కలెక్టర్ అశుతోష్ మిశ్రాకు ఫిర్యాదు చేయగా, ఆయన వెంటనే స్పందించి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి పనికి డబ్బులు వసూలు చేసి పని మాత్రం చేయడం లేదని, కార్యాలయానికి ఎవరు వచ్చినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. ములగకు చెందిన కొందరు తమ రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌కు రూ.2 లక్షలు ముట్టజెప్పినా పని చేయడం లేదని ఎమ్మెల్యేను కోరగా ఈ విషయంపై ఆయన మాట్లాడ్డానికి ప్రయత్నిస్తే దుర్భాషలాడారని, ప్రత్యారోపణకు దిగడాన్ని తాము ఖండిస్తున్నామని అన్నారు. ఆమెపై తగు చర్యలను తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. దీనికి సబ్ కలెక్టర్ స్పందిస్తూ తహశీల్దార్ జయలక్ష్మిపై వచ్చిన అవినీతి ఆరోపణపై విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. మండలంలోని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేపడతామని, నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి కృషి చేస్తామని నాయకులతో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు జి.వెంకటనాయుడు, మండల, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బోను చంద్రమౌళి గురజాన చంద్రమౌళి, గొట్టాపు రవి కుమార్, మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రా సౌండ్ స్కానర్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత ఏరియా ఆసుపత్రిలో శనివారం అల్ట్రా సౌండ్ స్కానర్ స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. స్కానర్‌ను ఉచితంగా ఆసుపత్రికి అందించిన డెక్కన్ కెమికల్ సంస్థను అభినందించారు. డివిజన్ కేంద్రంలో ఉన్న ఆసుపత్రికి ఈ సేవలు ఎంతో అవసరమన్నారు రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలకు చేసుకోవడానికి స్కానర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి, డెక్కన్ కెమికల్ చెందిన ప్రతినిధి మనోహర్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, ఆర్ఎంఒ చిరంజీవి, సీతంపేట ఆసుపత్రి సూపరింటెంటెంట్ శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, వైస్ ఎంపిపి వాకముడి అనిల్, టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్‌కుమార్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు తదితరులు ఉన్నారు.

మండల కన్వీనర్ల ఎంపికలో సమర్ధతకే పెద్దపీట

కురుపాం : స్థానిక ఎన్నికల దృష్ట్యా మండల కన్వీనర్ల ఎన్నిక సమర్ధతకే పెద్ద పీట వేస్తామని కురుపాం నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం నుంచి అక్కేన మధుసూదనరావు, తవిటినాయుడు (అంబటి రాంబాబు), ద్వారపురెడ్డి సత్యనారాయణ, మరడాన నారాయణస్వామి, జియ్యమ్మవలస మండలం నుంచి పల్లా రాంబాబు, గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, దాసరి రామారావు నాయుడు, జోగి భుజంగరావు, లక్ష్మీపతుల తాతబాబు, కురుపాం మండలం నుంచి కలిశెట్టి కొండయ్య, బిడ్డిక కడాయి, పత్తిక మాసయ్య, బిడ్డిక యువరాజు, కర్రి శ్రీనివాసరావు, బి శంకర్రావు, జి.రమణమూర్తి, కొమరాడ మండలం నుండి సేనాపతి ఉదయశేఖర్ పాత్రుడు, నంగిరెడ్డి మధుసూదన్‌రావు, మరడాన కృష్ణమూర్తి నాయుడు, గంటా వెంకటనాయుడు, మరడాన వెంకట నాయుడు, బిడ్డిక తమ్మయ్య, గన్ని కృష్ణ, నీరస శ్రీనివాసరావు, గుమ్మలక్ష్మీపురం మండలం నుంచి పాడి సుదర్శన్‌రావు, మండంగి భూషణరావు, బిడ్డిక పద్మావతి, తాడంగి రామారావు, తాడంగి లక్ష్మణరావు, అడ్డాకుల నరేష్ కన్వీనర్ల పదవులకు ప్రతిపాదనలు పెట్టారని మహానాడులోపే వీరి నియామకం ప్రకటిస్తున్నట్టు తెలిపారు.

చినతోలుమండగూడలో వైద్య శిబిరం

కురుపాం : జియ్యమ్మవలస మండలంలోని చిన్న తోలుమండగూడ గిరిజన గ్రామంలో శనివారం రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చీకటి శంకరరావు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం జ్వరాల బారిన పడకుండా, వడదెబ్బ తగలకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బకు గురైతే ఒఆర్ఎస్‌ను తాగి ఉపశమనం పొందేలా వ్యాధుల బారినపడకుండా పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీతో గ్రామాల సంపూర్ణ అభివృద్ధి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని, అందుకోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా వేతనదారులు తమ గ్రామంలోనే పనులను చేసుకొని వేతనాన్ని పొందవచ్చని, పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఉద్బోధించారు. మండలంలోని లక్ష్మీనారాయణపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామాలకు కావాల్సిన రోడ్లు, కాలువలు, చెరువుల పూడికతీత, భూమి చదును పనులు, ఇంకుడు గుంతలు, ఫారంపాండ్లు, నీటి కుంటల నిర్మాణం వంటివి చేపట్టుకోవచ్చని తెలిపారు. వీటితో పాటు పర్యావరణ పనులు, మౌలిక వసతుల అభివృద్ధి, జలవనరుల నిర్వహణ, వ్యవసాయ పనులు, ఇతర పనులను కూడా నిర్వహించుకోవచ్చని ఆయన గుర్తుచేశారు. అనంతరం ఉపాధి వేతనదారుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సందర్శించి వేతనదారులకు మజ్జిగను పంపిణీ చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి బీపీ, షుగర్ వంటి పరీక్షలను వేతనదారులకు చేయించి స్వయంగా పరిశీలిందారు. ఈ పర్యటనలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో కుండపోత వర్షం

సీతంపేట : సీతంపేట ఏజెన్సీలో గత రెండు రోజులుగా సాయంత్రమయ్యేసరికి వర్షం కురుస్తుంది. అయితే ఉదయం 6 గంటలకే ఎండ తీవ్రంగా మొదలవుతుంది. మధ్యాహ్నం వరకు సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. సాయంత్రం మూడు గంటలయ్యేసరికి ఉరుములు, మెరుపులతో పెద్ద పెద్ద భీంకరమైన శబ్దాలతో పిడుగుతో పాటు వర్షం కురుస్తుంది. ఒకపక్క పిడుగుల భయం ఉన్నప్పటికీ వర్షం పడటంతో ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతుంది

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా కురుపాంలోని సాయిరాం గుడి నుంచి రావాడ జంక్షన్ వరకు స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం తిరంగ యాత్ర ర్యాలీతో వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు మద్దతుగా కులాలు, మతాలకు అతీతంగా భారతీయులంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, కూటమి నాయకులు డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్ కుమార్, నందివాడ కృష్ణబాబు, ఐదు మండలాల కన్వీనర్లు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు ,యువత, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పాలకొండ : ఆపరేషన్ సింధు విజయవంతం భారత త్రివిధ దళాలకు మద్దతుగా శనివారం తిరంగా ర్యాలీ చేపట్టారు. కోటదుర్గ ఆలయం నుంచి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనే దేశభక్తి ఉండాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, మాజీ ఎఎంసి చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి, తూర్పు కాపుకార్పొరేషన్ డైరెక్టర్లు టెంకాల దుర్గారావు, గర్భాన సత్తిబాబు, వైస్ ఎంపిపి వాకమూడి అనిల్, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, ఆకుల కుమార్ రాజేష్ తదితరులు ఉన్నారు.

గురజాడ విద్యాసంస్థల అధినేతను కలిసిన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జూన్ 8న పాఠశాల 75వ వజ్రోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని శనివారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.స్వామినాయుడును వజ్రోత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం పలికారు. ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఐటిడిఎలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలను పిఒతో పాటు అధికారులు శుభ్రం చేశారు. అదే విధంగా మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని, ప్రభుత్వం నిర్దేశించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చినబాబు, ఎఒ వి.సునీల్, పిహెచ్ఒ వెంకట గణేష్, ఉపాధిహామీ ఎపిడి శ్రీహరిరావు, అకౌంట్స్ ఆఫీసర్ విజయరాణి సూపరింటెండెంట్ దేస్, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే సీతంపేట గ్రామపంచాయతీలో మండల ప్రత్యేక అధికారి జి.చినబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సీతంపేట గ్రామపంచాయతీ పరిధిలో అన్ని మండల స్థాయి అధికారులు గ్రామ సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాన హారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మిశ్రా, సిడిపిఒ పి.రంగలక్ష్మి, డిప్యూటీ ఎంపిడిఒ బి.రామకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ సత్యం, పంచాయతీరాజ్ ఎఇ కిరణ్, ఎంఇఒ ఆనందరావు, సర్పంచ్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : పంచాయితీల్లో పరిశుభ్ర వాతావరణం ఏర్పడాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర –స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టిందని మండల ప్రత్యేక అధికారి బి.శ్యామల అన్నారు. మండలంలోని వెంకట భైరిపురం, కాశీపట్నం పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర –స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని బీట్ టీంతో కలిసి నిర్వహించారు. అనంతరం స్థానిక సర్పంచ్ వెంకటరత్నం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్ ఏనుగుల గణపతిని సన్మానించారు. గోపాలమిత్ర భవనం వద్ద పశువుల తొట్టి, బస్ స్టాప్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాశీపట్నం సర్పంచ్ చంద్రరావు, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, ఎపిఒ ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఐటిడిఎ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న పిఒ

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు జరిపిన పిదప వివరాలు వెల్లడించడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. అటువంటి స్కానింగ్ సెంటర్లపైనా, సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా సెంటర్ల లైసెన్సులను రద్దుచేస్తామని హెచ్చరించారు. గర్భస్థ శిశు స్థితిగతులు, సమస్యలు తెలుసుకునేందుకే స్కానింగులు చేయాలే తప్ప, వీటిని ఆసరాగా తీసుకుని గర్భస్థ శిశు వివరాలు వెల్లడించడం నేరమన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ (పి.సి.పి.ఎన్.డి.టి) చట్టం అమలుపై జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం డిఎంహెచ్ అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశమందిరంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 44 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి స్కానింగ్ సెంటరులో సి.సి కెమెరాల ఏర్పాటుతో పాటు ఆయా కేంద్రాలపై ప్రోగ్రాం అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇకపై ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగే అబార్షన్ల వివరాలతో పాటు అందుకు తగిన కారణాలను తమకు సమర్పించాలని స్పష్టం చేశారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమనే విషయాన్ని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని, బాలికల పట్ల వివక్ష లేకుండా సమాజంలో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ముఖ్యంగా జూనియర్ కళాశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో అవగాహన కల్పించడం ద్వారా మంచి ఫలితాలు ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కమిటీ సభ్యులు సూచించిన సలహాలను పరిగణలోకి తీసుకొని భవిష్యత్తులో మరింత పటిష్టంగా చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కెవిఎస్ పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, డిఐఒ డాక్టర్ ఎం.నారాయణ, డిజిఒ డాక్టర్ సీహెచ్.కమలకుమారి, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ వి.శ్రీధర్, రేడియోలజిస్ట్ డాక్టర్ ఎం.జయరాం, సామాజిక కార్యకర్త శ్రీహరి, ఇతర వైద్యులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దింపేటలో అధ్వానంగా పారిశుధ్యం

కాలువల్లో పేరుకుపోయిన పూడికలు

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెద్దింపేటలో గల వీధి కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందన కరువైంది. ఈ మేరకు శనివారం ఆ గ్రామాన్ని సిపిఎం నాయకులు వెన్నెల వేణు, యమ్మల మన్మధరావు తదితరులు సందర్శించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గ్రామంలో కాలువల్లో పేరుకుపోయిన చెత్త తీయకపోవడం వల్ల దోమలు దాడి చేయడంతో మలేరియా, డెంగీ వంటి విష జ్వరాల బారినపడే ప్రమాదం ఉందన్నారు. బ్లీచింగ్ చల్లక కాలువలు శుభ్రం లేక దుర్గంధం వెదజల్లుతోందని, ఈ విషయమై ఎన్నిసార్లు సర్పంచ్‌కు, ఎంపిటిసికి, పంచాయతీ సెక్రెటరీకి చెప్పినా ఫలితం లేదని గ్రామస్తులు తెలిపారని చెప్పారు. కావున జిల్లా అధికారులు స్పందించి కాలువల్లో పూడుకలు తీయించాలని కోరారు. అలాగే తాగడానికి నీరు లేక పొలంలో నేలబావుల నుంచి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఏడాదైనా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. తక్షణమే అధికారులు స్పందించి గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దుర్గారావు, గౌరీశ్వరరావు, సాంబమూర్తి, సత్యం, గౌరీ, గౌర్నాయుడు, విశ్వేశ్వరరావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు,

ధ్యానంతో జ్ఞాపకశక్తి

ప్రజాశక్తి - గరుగుబిల్లి



యువతకు సూచనలు ఇస్తున్న విశ్రాంత ఐఎఎస్ అధికారి మురళి

చదవడం, రాయడం, మాట్లాడడం విజయానికి సోపానాలని, ధ్యానంతో అపార జ్ఞాపక శక్తి కలిగి ఉంటుందని యువతకు విశ్రాంత ఐఎఎస్ అధికారి జె.మురళి సూచించారు. తోటపల్లి జట్టు ట్రస్ట్‌లో మూడు రోజుల పాటు జరిగిన కెరీర్ గైడెన్స్ శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్షరాస్యతలో వెనుక ఉన్న ఉత్తరాంధ్ర నుంచి ఎక్కువ మంది ఉన్నత చదువులు చదివి సివిల్ సర్వీసు ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లోనూ ముందడుగు వేయాలని కోరారు. శిక్షణా కార్యక్రమానికి హాజరైన యువతీ యువకులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి నిరంతరం ప్రత్యేక దృష్టి పెట్టి సలహాలు ఇవ్వడం ద్వారా ప్రోత్సాహం అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు మాట్లాడుతూ మారుమూల గ్రామంలో ఉన్న తమ దగ్గరకు వచ్చి అనేక బోధనా పద్ధతులు ద్వారా అవగాహన కల్పిస్తున్న మురళికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం, కుటీర పరిశ్రమల ద్వారా స్వయం సమృద్ధి సాధించవచ్చని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విజయనగరం మహారాజా ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మోహన్ కుమార్, ఎస్‌బిఐ విశ్రాంత చీఫ్ మేనేజర్ లక్ష్మణరావు, యూనియన్ బ్యాంకు విశ్రాంత చీఫ్ మేనేజర్ ఉదయ భాస్కర్,శ్రీధర్ నాయుడు, సోమశేఖర్ ప్రభుతులు పాల్గొన్నారు.